ఎపిఎల్‌కు సాయిప్రకాష్ ఎంపిక

సాయిప్రకాష్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని పోతవరప్పాడు ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఇంజినీరింగ్ డేటా సైన్స్ విభాగంలో మొదటి సంవత్సరం చదువుతున్న తాతా సాయిప్రకాష్ బెజవాడ టైగర్స్ తరపున ఆంధ్రా ప్రీమియర్ లీగ్(ఎపిఎల్)కు ఎంపికైనట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి.గౌతు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలల్లో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ డాక్టర్ ఆర్.వెంకట్రావు, ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాగభాస్కర్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వి.సురేంద్ర, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎన్.మాధవరావు అభినందించారు.

బెట్టింగ్... టెన్షన్...!

◆అధినాయకుల ప్రకటనలతో పెరిగిన పందేల జోరు ◆ఫలానా పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని భారీగా పందేలు

◆స్థానిక ఎంఎల్ఎ అభ్యర్థుల గెలుపుపై, మెజార్టీపై సై ◆ పలు నియోజకవర్గాల్లో ఒకటికి, రెండు చెల్లింపు పందేలు

◆సామాన్యులు సైతం పందేల ఊబిలోకి ◆ ఫలితాల సరళిపై లోలోన ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తమ పార్టీకి అత్యధిక సీట్లు వస్తాయని ప్రధాన పార్టీలైన టిడిపి కూటమి, వైసిపి అధినాయకుల ప్రకటనలతో పందేల జోరు మరింత పెరిగింది. మొన్నటి వరకూ ఎంఎల్‌ఎల గెలుపుపై పందేల జోరు సాగగా, ఇప్పుడు ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందనే దానిపై పందేలు సాగుతున్నాయి. గడిచిన రెండు రోజుల కాలంలో బెట్టింగ్‌రాయుళ్ల మరింత రెచ్చిపోతున్నారు. నాయకుల ప్రకటనలతో సామాన్యులు సైతం పందేల ఊబిలో చిక్కుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఆయా పార్టీల అధినాయకుల ప్రకటనలు కేడర్‌లో ఉత్సాహం నింపేలా ఉన్నప్పటికీ చాలామంది సామాన్యులు సైతం ఆ మాటలతో పందేలకు దిగుతున్న పరిస్థితి జిల్లాల్లో కన్పిస్తోంది.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన టిడిపి కూటమి, వైసిపి నువ్వానేనా అన్నట్లు పోటీ పడ్డాయి. ఆచంట, ఉండి, దెందులూరు, నూజివీడు వంటి నియోజకవర్గాల్లో పోటీ మరింత రసవత్తరంగా నడిచింది. ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారో అంచనా వేయడం కష్టతరంగా మారింది. మిగిలిన నియోజకవర్గాల్లో పోటాపోటీగా ఎన్నికలు జరిగాయి. రెండు రోజుల క్రితం వరకూ ఎంఎల్‌ఎగా ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారనే దానిపై పందేలు సాగాయి. కొన్ని నియోజకవర్గాల్లో ఫలానా అభ్యర్థి గెలుస్తారంటూ ఒకటికి, రెండింతలు ఇచ్చేలా పందేలు కాసిన పరిస్థితి ఉంది. తాము చెప్పిన అభ్యర్థి గెలిస్తే రూ.లక్ష, మీరు చెప్పిన అభ్యర్థి గెలిస్తే రూ.రెండు లక్షలు ఇస్తామన్న రీతిలో పందేలు పట్టిన పరిస్థితి ఉంది. ఇటీవల కాలంలో వైసిపి, టిడిపి కూటమికి చెందిన అధినేతలు తమకు ఇన్ని సీట్లు వస్తాయని ప్రకటించడం పందేల జోరుకు మరింత ఊతమిచ్చింది. తమ పార్టీ అధినేత చెప్పారంటే పక్క సమాచారం ఉంటుందని ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలతోపాటు సామాన్యులు సైతం అంచనా వేస్తున్నారు. దీంతో ఇటీవల కాలంలో జరుగుతున్న పందేల్లో రాష్ట్రంలో ఏపార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందనే అంశంపైనే పందేలు సాగుతున్నాయి. సామాన్యులు సైతం పందేలకు దిగడం కన్పిస్తోంది. ఎన్నికల బెట్టింగుల్లో సామాన్య ప్రజానీకం బలిపశువులుగా మారుతున్నారు. రబీ పంట ఇప్పుడే చేతికి రావడంతో సామాన్య రైతులు సైతం పందేలకు దిగుతున్నారనే చర్చ నడుస్తోంది. పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు తీర్చాల్సి ఉండగా ఆ సొమ్మును పందేలకు పెడుతున్నారని చెబుతున్నారు. ఏలూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానం ఉండగా అన్ని స్థానాలూ ఒక పార్టీ గెలుస్తుందని కొందరు, ఆ విధంగా జరగదని మరికొందరు పందేలు పడుతున్నారు. ఏలూరు జిల్లాలోనూ ఏడు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానం ఉండగా మెజార్టీ స్థానాలు ఫలానా పార్టీ గెలుస్తుందనే లెక్కలు వేసి పందేలు వేస్తున్న పరిస్థితి ఉంది. పోలవరం స్థానంపై మెజార్టీ పందేలు, సీటు పందేలు ఎక్కువగా సాగుతున్నట్లు చెబుతున్నారు. ఒక్కో నియోజకవర్గంలో తక్కువ లెక్కించినా రూ.20 కోట్లు వరకూ పందేలు సాగినట్లు అంచనా. ఉండి నియోజకవర్గంలో ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి వేటుకూరి శివరామరాజుకు ఎన్ని ఓట్లు వస్తాయనే దానిపైనా పందేలు నడుస్తున్నాయి. రఘురామకృష్ణంరాజు గెలుపోటములపైనా అదేరీతిన పందేలు పడుతున్నారు. పందేల పేరుతో చాలామంది సామాన్యులు అప్పుల పాలయ్యే పరిస్థితి ఉంది. పార్టీల అధినాయకుల ప్రకటనలు నిండా ముంచే ప్రమాదం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రకరకాల ప్రకటనల ఆధారంగా బెట్టింగులు కాసిన పందెంరాయుళ్లంతా ఫలితాలు తర్వాత పరిస్థితి ఏమిటోననే భయం అందరినీ వెంటాడుతోంది.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద అంతా కట్టుదిట్టం

పరిశీలించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి

స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేస్తున్న కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు

సార్వత్రిక ఎన్నికలు ముగిసి ఇవిఎం, వివిప్యాట్‌లు భద్రపర్చిన సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో స్ట్రాంగ్‌రూమ్ ప్రాంతాలను శనివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. భద్రతాపరమైన అంశాల్లో సిబ్బందికి సూచనలు, సలహాలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సంబంధిత లాగ్‌బుక్‌లో కలెక్టర్, ఎస్‌పి సంతకాలు చేశారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత విషయంలో జిల్లా ఎస్‌పితో కలిసి కార్యాచరణ రూపొందించామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఏలూరు జిల్లాకు చెందిన ఏడు అసెంబ్లీ, ఏలూరు పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి పోలింగ్‌లో వినియోగించిన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్స్, వివిప్యాట్స్ అత్యంత జాగ్రత్తగా భద్రపర్చామన్నారు. రాజకీయ హింసకు సంబంధించి ఏదైనా సంఘటనకు స్పందించే క్రమంలో ప్రజలు, మీడియా సంయమనం పాటించాలన్నారు. ఈ విషయంలో ప్రతిఒక్కరూ బాధ్యతతో సహకరించాలన్నారు. ఇటువంటి ఘటనలు జరిగిన సందర్భంలో సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని, తమకు ముందస్తు సమాచారం అందించాలని కోరారు. జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూమ్ వద్ద అప్రమత్తతో విధులు నిర్వహించాలన్నారు. స్ట్రాంగ్‌రూమ్ ప్రాంతాల్లో మూడంచెల భద్రత ఏర్పాటు చేసి, సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసినట్లు, స్ట్రాంగ్‌రూమ్ చుట్టుపక్కల 144 సెక్షన్ అమలులో ఉందని అన్నారు. ప్రజలు ఎవరూ సదరు కాలేజీ చుట్టుపక్కల సంచరించరాదని హెచ్చరించారు. వీరి వెంట ఉంగుటూరు, ఏలూరు, కైకలూరు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఎన్ఎస్‌కె.ఖాజావలీ, ఎం.ముక్కంటి, కె.భాస్కర్, ఎఆర్ ఎఎస్‌పి ఎస్ఎస్.శేఖర్, ఎఆర్ డిఎస్‌పి శ్రీహరిరావు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల సేవలు వినియోగించుకోవాలి

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్


బాధ్యులతో మాట్లాడుతున్న విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి - భీమడోలు

బాలికా విద్యను ప్రోత్సహించే క్రమంలో గ్రామీణ ప్రాంతాల్లోని హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలల సేవలు వినియోగించుకోవాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ కోరారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యకార్యదర్శి మండలంలోని భీమడోలు, గుండుగొలను హైస్కూళ్లను సందర్శించారు. వీరితోపాటు ప్రభుత్వ టెస్ట్ బుక్స్ డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భీమడోలు హైస్కూల్లో వివిధ ప్యానెల్స్ పనితీరు గురించి ప్రవీణ్‌ప్రకాష్ ఆరా తీశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను వాటిని వినియోగించే తీరు తెన్నుల గురించి అడిగారు. ఆయా పాఠశాలల్లో పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణులుకాని వారికి నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థులతో మమేకమయ్యారు. వారి అభిప్రాయాలను అడిగారు. ఆపై విద్యా కానుకల్లో భాగంగా మండల స్టాక్ పాయింట్‌లో పంపిణీకి సిద్ధంగా ఉన్న పుస్తకాలను పరిశీలించారు. ఇదే క్రమంలో పాఠ్యపుస్తకాల నాణ్యత, ముద్రణ తీరు, పుస్తకాలు, పాఠాల్లో ప్రత్యేకంగా వినియోగించిన బొమ్మల రంగులు, ఇతర అంశాలను తనిఖీ చేశారు. నాడు-నేడు పనుల ప్రగతిని పరిశీలించారు. డిజిటల్ విద్యా విధానం గురించి మండల విద్యాధికారులు శ్రీనివాసరావు, భాస్కర్‌కుమార్‌తోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.శ్రీనివాసరావు వివరించారు. కార్యక్రమంలో డిఇఒ ఎ.అబ్రహంతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

20 ప్రాంతాల్లో వేసవి వినోద శిబిరాలు



శిబిరంలో విద్యార్థులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వేసవి సెలవుల్లో విద్యార్థులకు వినోదంతో కూడిన విజ్ఞానం అందించేలా హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్, ప్రజాసంఘాల సహకారంతో 20 ప్రాంతాల్లో వేసవి వినోద శిబిరాలను నిర్వహిస్తున్నామని హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి పి.దుర్గాప్రసాద్ తెలిపారు. శనివారం ఉదయం ఏలూరు బాలల గ్రంథాలయం వద్ద జరిగిన చిల్డ్రన్స్ క్లబ్ వేసవి శిబిరం వద్ద ఆయన మాట్లాడారు. ఏలూరులో ప్రతియేటా వేసవి సెలవుల్లో విద్యార్థులకు వినోదంతో కూడిన విజ్ఞానం కలిగించేలా అనేక అంశాల్లో తర్ఫీదు ఇస్తున్నట్లు తెలిపారు. ఆటలు, పాటలు, డ్యాన్స్, చిత్రలేఖనం, మ్యాథమెటిక్స్‌లో ట్రిక్స్, దేశ, జాతీయ నాయకుల జీవిత చరిత్రల వీడియో ప్రదర్శన చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాలకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం తదితర ప్రజా సంఘాలు సహకారం అందిస్తున్నాయని తెలిపారు. ఏలూరు నగరంలో సుమారు 20 ప్రాంతాల్లో ఈ వేసవి వినోద శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 17న ప్రారంభమైన శిబిరాలు జూన్ ఒకటో తేదీ వరకూ కొనసాగుతాయని తెలిపారు. ఈ శిబిరాల్లో విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ నిర్వాహకులు జి.శారద, ఉష అశ్విని, రాజేశ్వరి, యు.దుర్గ, ఎ.క్రాంతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.ఠాగూర్‌రాజా, కె.లెనిన్, ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.హైమావతి తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు స్వయం సంరక్షణలో తర్ఫీదు అవసరం

డిఎస్‌పి మురళీకృష్ణ


ప్రశంసాపత్రాలతో బాలికలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

బాలికలకు చదువుతోపాటు స్వయం సంరక్షణలో కూడా తర్ఫీదు అవసరమనిమహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి మురళీకృష్ణ అన్నారు. హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఎ) ఆధ్వర్యంలో ఈ నెల ఒకటో తేదీ ప్రారంభమై బాలికలకు స్వీయా రక్షణలో 15 రోజుల పాటు నిర్వహించిన ఉచిత శిక్షణా వేసవి తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శనివారం వైఎంహెచ్ఎ హాలు ప్రాంగణంలో బాలికలకు ప్రశంసాపత్రాలు ప్రదానోత్సవ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి మురళీకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. 50 మందికి పైగా బాలికలు 15 రోజుల పాటు ఈ శిక్షణా తరగతులు ఉపయోగించుకుని శారీరక ధృఢత్వంతో పాటు మానసికంగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొవడానికి ఉపయోగపడే స్వయం రక్షణ, యోగా, ధ్యాన, ఓర్పు నేర్పుతో ఎలా ఉండాలనే అంశాల్లో శిక్షణ పొందారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిఎస్‌పి మురళీకృష్ణ మాట్లాడుతూ బాలికలకు చదువుతోపాటు స్వయం సంరక్షణలో కూడా తర్ఫీదు అవసరమని, అందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని తెలిపారు. హిందూ యువజన సంఘం కమిటీ ఇటువంటి ఉపయోగకర కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎంహెచ్ఎ మేనేజ్‌మెంట్ కమిటీ ఇన్‌ఛార్జి ప్రధాన కార్యదర్శి వేమా కోటేశ్వరరావు, కార్య నిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, శిక్షణ తరగతులు నిర్వహించిన ఆర్.వేణుగోపాల శ్రీనివాస్ ప్రసంగించారు. అనంతరం ప్రశంసాపత్రాల బహూకరణ మహోత్సవం, బాలికల సంరక్షణ పోస్టర్ ఆవిష్కరణ, ముఖ్య అతిథి డిఎస్‌పి మురళీకృష్ణ సత్కరించే కార్యక్రమాలు నిర్వహించారు.

జూన్ 29న మెగా లోక్ అదాలత్

చింతలపూడి న్యాయస్థానం ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు

ప్రజాశక్తి - చింతలపూడి

వచ్చే నెల 29వ తేదీన మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని చింతలపూడి న్యాయస్థానం ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి ఉత్తర్వుల మేరకు జూన్ 29వ తేదీన చింతలపూడి కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీ పడు క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాలు, భార్య భర్తల మధ్య ఉన్న మనోవర్తి, సివిల్, ప్రామిసరీ నోట్, బ్యాంక్ కేసులు పరిష్కరిస్తారని, ప్రీ లిటిగేషన్ కేసులుగా బ్యాంక్ బకాయి కేసులు, టెలిఫోన్ బకాయి కేసులు పరిష్కరిస్తారని తెలిపారు. ప్రతి రోజూ కోర్టులో ప్రీ సిట్టింగ్స్ ద్వారా కేసులు రాజీ చేస్తున్నారని, కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. కేసులు రాజీ చేసుకోవడం వల్ల విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌పై పోలీస్‌లు కక్షిదారులకు అవగాహన కల్పించి రాజీ మార్గంపై అవగాహన కల్పించాలని తెలిపారు.

యాత్రికులతో కిక్కిరిసిన శ్రీవారి ఆలయం

క్యూలైన్లో యాత్రికులు

బస్సు కోసం వేచి చూస్తున్న యాత్రికులు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయం వేసవి సెలవులు, బ్రహ్మోత్సవాల కారణంగా శనివారం యాత్రికులతో కిక్కిరిసిపోయినది. ఐదు కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయాయి. స్వామి వారి దర్శనానికి రెండు నుంచి మూడు గంటల సమయం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. స్వామి వారి ప్రధాన దక్షిణ రాజా గోపురం, పడమర రాజా గోపురం మూసి వేయడం వల్ల బయటకు బస్టాండ్ కు వెళ్లే భక్తులు, తొలి మెట్టు వద్దకు వెళ్లే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్వామి వారి ఉచిత ప్రసాద వితరణ క్యూ లైన్ దగ్గర పెట్టడం వల్ల దర్శనానికి వెళ్లి వచ్చే భక్తులు పొగడ చెట్టు వద్ద ఆగిపోయి బయటకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్వామివారి ఉచిత ప్రసాద వితరణ తూర్పు రాజుగాపురం బయట అనివేటి మండపం వద్ద ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఆర్‌టిసి బస్సులు లేక యాత్రికుల ఇబ్బందులు

వేసవి సెలవులు కావడంతో ద్వారకాతిరుమల చినవెంకన్నను దర్శించుకోవడానికి విద్యార్థులు, భక్తులు శనివారం పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ద్వారకాతిరుమల చేరుకోవడానికి తిరిగి వెళ్లేందుకు బస్సులు లేక వీరు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆలయం సెంటర్‌లో, బస్టాండ్ వద్ద వందల సంఖ్యలో యాత్రికులు అవస్థలు పడ్డారు. ఆర్‌టిసి వారు బస్సులు సకాలంలో నడపకపోవడం, శని ఆదివారాల్లో ప్రత్యేక సర్వీసులు పెంచకపోవడం వల్ల యాత్రికులు వారి వారి గమ్యస్థానాలు చేరుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై ఆర్‌టిసి వారు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఆర్‌టిసి బస్సులు నడపాలని యాత్రికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఆటోను ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్

ఐదుగురికి గాయాలు

టైర్ పంక్చర్ కావడంతో ప్రమాదం

ప్రజాశక్తి - ముసునూరు

పెట్రోల్ ట్యాంకర్ టైర్ పేలడంతో అదుపుతప్పి ఆటోను ఢీకొట్టి బొల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలోని ఐదుగురు ప్రయాణికులు గాయాల పాలయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నూజివీడు నుంచి జంక్షన్ వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ టైర్ మీర్జాపురం వద్ద పంక్చర్ అయింది. దీంతో ఆయిల్ ట్యాంకర్ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టి బొల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలోని ఐదుగురు ప్రయాణికులు గాయాల పాలయ్యారు. తణుకు మండలం పైడిపర్రు గ్రామానికి చెందిన నాగపెద్దిరాజు, వైజాగ్ గాంధీనగర్‌కు చెందిన కూరం దాస్‌గోవింద్, కూరం ఆదిలక్ష్మి, కూరం దాస్‌రత్నం, అరస ప్రతాప్ గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను స్థానికులు నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికత్స నిమిత్తం అక్కడినుంచి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


ఆటోను ఢీకొట్టి బొల్తా పడిన ఆయిల్ ట్యాంకర్

అంచనాల్లో నేతలు.. సమస్యల్లో ప్రజలు

పోలింగ్ ముగిసింది. ఫలితాల కోసం నిరీక్షణ మిగిలింది. అభ్యర్థులు, వారి అనుయాయులు కూడికలు, తీసివేతల్లో బిజీగా ఉన్నారు. రాజకీయ నేతలు, పందెంరాయుళ్లు గెలుపోటములపై అంచనాల్లో తలమునకలయ్యారు. అధికారులు స్ట్రాంగ్‌రూముల భద్రత, కౌంటింగ్ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మరి రెండు నెలలుగా ఎన్నికల కోడ్ పేరుతో పక్కన పెట్టిన ప్రజా సమస్యలను పట్టించుకునే నాధుడే లేడా అనే ప్రశ్న సర్వత్రా ఉత్పన్నమవుతోంది.

ప్రజా సమస్యలను ఏళ్ల తరబడి నిర్లక్ష్యం చేస్తే సామాన్యులే తిరగబడతారనే దానికి ఏలూరు జిల్లాలోని చింతలపూడి, కొయ్యల గూడెం మండలాల్లో ప్రజలు పోలింగ్ బహిష్కరణకు సిద్ధపడటమే నిదర్శనం. ఏళ్ల తరబడి రోడ్డు సమస్య పరిష్కరించడం లేదంటూ చింతలపూడి మండలం దేశవరం గ్రామస్తులు పోలింగ్ బహిష్కరించారు. స్థానిక అధికారులు, నేతలు నచ్చజెప్పినా ససేమిరా అనడంతో ఉన్నతాధికారులు రంగంలోకి దిగాల్సి వచ్చింది. ఏళ్ల తరబడి ఉన్న సమస్యను కచ్చితంగా పరిష్కరిస్తామని జిల్లా అధికారులు హామీ ఇవ్వడంతో దేశవరం గ్రామస్తులు శాంతించి పోలింగ్‌లో పాల్గొన్నారు.

ఇదే పరిస్థితి కొయ్యలగూడెం మండలం వంకబొత్తప్పగూడెం పోలింగ్ కేంద్ర పరిధిలో చోటుచేసుకుంది. కొయ్యలగూడెం, టి.నర్సాపురం మండలాల్లోని గిరిజన గ్రామాలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించి ఐటిడిఎ పరిధిలోకి తీసుకురావాలనే డిమాండ్ చాలాకాలంగా ఉంది. దీనిపై నేతలు ప్రకటనలు గుప్పించడం మినహా కార్యాచరణకు ప్రయత్నించిన దాఖలాల్లేవు. దీంతో ఆగ్రహించిన వంకబొత్తప్పగూడెం పోలింగ్ కేంద్రం పరిధిలోని నాలుగు గిరిజన

గ్రామాల ప్రజలు పోలింగ్ బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఆగమేఘాల మీద రంగంలోకి దిగిన అధికారులు పలుదఫాలుగా చర్చల అనంతరం ఆ గ్రామాల గిరిజనులు ఎట్టకేలకు పోలింగ్‌లో పాల్గొన్నారు. ఈ రెండు ఘటనలు జిల్లాలో పేరుకుపోయిన అపరిష్కృత సమస్యలను చెప్పకనే చెబుతున్నాయి.

ఇక ఏజెన్సీలోని కుక్కునూరు మండలం దామరచర్ల పంచాయతీ పరిధిలోని కురుములతోగులో ఇద్దరు గిరిజనులు అతిసారతో మృతి చెందడం తీవ్ర కలకలం రేపింది. సుమారు 23 ఏళ్లుగా అక్కడ సుమారు 50కుపైగా కుటుంబాలు నివశిస్తున్నా ఇప్పటికీ రోడ్డు, విద్యుత్, తాగునీటి సదుపాయాలు మాత్రం లేకపోవడం గమనార్హం. తమ హయాంలో ప్రతి మారుమూల గిరిజన గ్రామానికీ విద్యుత్ సౌకర్యం కల్పించామని నేతలు గొప్పగా ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు దానికి భిన్నంగా ఉన్నాయనే దానికి ఈ గ్రామమే నిదర్శనం. తాత్కాలికంగా ట్యాంకర్ ద్వారా నీరు పంపి, వైద్య శిబిరం ఏర్పాటు చేసి హడావుడి చేస్తున్న అధికారులు సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు ఎప్పటికీ తీసుకుంటారో వేచిచూడాలి. అదే మండలంలోని పలు గ్రామాలకు నేటికీ రోడ్డు సౌకర్యం లేదనేది బహిరంగ రహస్యం. ఇప్పటికీ ఆయా గ్రామాల నుంచి డోలిపైనే రోగులను, గర్భిణులను, వృద్ధులను తీసుకొచ్చే పరిస్థితి ఉందంటే నమ్మక తప్పదు. ఈ సమస్యలేవీ ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచారంలోగాని, నేతల మాటల్లోగానీ ప్రస్తావనకు రాలేదు. ప్రజా సమస్యలు చర్చకు రాకుండా అటు అధికారపక్షం, ఇటు ప్రధాన ప్రతిపక్షం సైతం పరస్పర విమర్శలు, డబ్బు ప్రభావాన్నే నమ్ముకుని ముందుకు సాగడం బాధాకరం. మరి ఫలితాలు వచ్చాక కొలువుదీరే కొత్త ప్రభుత్వం, ప్రజాప్రతినిధులైనా ఈ సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తారో లేక ఎప్పటిలానే ముఖం చాటేస్తారో వేచిచూడాలి.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్



సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పేదల పక్షపాతి సుందరయ్య

ప్రజాశక్తి - నిడమర్రు

మండలంలోని అడవికొలను, చానామిల్లి గ్రామాల్లో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి వారోత్సవ సభలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధుడు, పేదల పక్షపాతి, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, భారతదేశ తొలి పార్లమెంట్ ప్రతిపక్ష సభ్యులు పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. నిరంతరం పేద ప్రజలు అభ్యున్నతి, సంక్షేమం కోసం, సోషలిజం సమ సమాజ స్థాపన కోసం, కుల మతాలు అంతరాలు లేని దేశం కోసం నిరంతరం పోరాడారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. ఆయన పార్లమెంట్‌కి సైకిల్ వేసుకుని వెళ్లేవారని, ప్రజల కోసం నిరంతరం పనిచేసే వారని పలువురు వృద్ధులు అన్నారు. ఈ కార్యక్రమంలో కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, ఆసుపు హరిప్రసాద్, కురేటి అప్పారావు, కందుల పేరంటాలు, లంక అప్పారావు, లావేటి సోంబాబు పాల్గొన్నారు.

పోటీల ప్రారంభంలో నృత్య ప్రదర్శన

జాతీయస్థాయి నృత్య పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

బివిఆర్ కళా కేంద్రం ఆధ్వర్యంలో జాతీయస్థాయి నృత్య పోటీలు బివీఆర్ కన్వెన్షన్ హాలులో శనివారం ఉదయం ప్రారంభమయ్యాయి. సుమారు 200 మంది కళాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో భరతనాట్యం, కూచిపూడి, జానపదం తదితర నృత్యాలను ప్రదర్శించారు. జూనియర్స్, సీనియర్స్ రెండు విభాగాలుగా రెండు రోజులపాటు పోటీలు జరుగుతాయన్నారు. పోటీల సందర్భంగా హైదరాబాద్, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు చెందిన సీనియర్ కళాకారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బివిఆర్ కళాకేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు బుద్దాల వెంకటరామారావు, పిటి.వెంకన్న, దాసరి కాశీవిశ్వనాథం, పేరేచర్ల మురళీకృష్ణంరాజు, కొప్పిశెట్టి రమణయ్య, పైలు శ్రీనివాసరావు, సరస్వతుల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గండికోట రాజేష్, నండూరి రాధిక న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

స్వర్ణాంధ్ర మెకానికల్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకునికి డాక్టరేట్

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సీతారామపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలలో మెకానికల్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పత్సమట్ల సత్యనారాయణరాజుకు ఒడిశ్శాలోని గుణుపూర్ గైట్ యూనివర్సిటీ డాక్టరేట్ లభించింది. స్ట్రెంత్ అండ్ థర్మల్ అనాలసిస్ ఆఫ్ సాండ్ విచ్ పైప్ ఫర్ డీప్ వాటర్ అప్లికేషన్స్ అనే అంశంపై చేసిన పరిశోధనలకుగాను ఒడిశ్శా రాష్ట్రానికి చెందిన గుణుపూర్ గైట్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఎవిఎన్ఎల్.శర్మ చేతుల మీదుగా సత్యనారాయణరాజుకు డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన డాక్టర పి.సత్యనారాయ ణరాజును కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, ట్రెజరర్ కె.వెంకటేశ్వరస్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.గోపీచంద్, స్వర్ణాంధ్ర ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.పండరీనాథ్, వివిధ విభాగాధిపతులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు అవార్డు గ్రహీతకు అభినందనలు తెలిపారు.

ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి

ప్రజాశక్తి - కలిదిండి

ఆర్యవైశ్య సంఘీయుల దేవత వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా స్థానిక వాసవీ క్లబ్ కలిదిండి గోల్డ్ అధ్యక్షులు బత్తుల రఘురాం, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కన్యలు, మహిళా భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ క్లబ్ వనిత కలిదిండి గోల్డ్ మాజీ అధ్యక్షురాలు వూర కళ్యాణి, నీలి మాధవి, మహిళా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షురాలు కారుమూరి నాగకుమారి, నీలి పద్మావతి, టౌన్ అధ్యక్షురాలు వూర లక్ష్మి, బత్తుల లక్ష్మి, మానేపల్లి పద్మావతి, నార్కేడమిల్లి మంగతాయారు, దేవి, పలివెల రాజేశ్వరి, పెనుకొండ పావని, చక్కా జగన్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన ముదినేపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ముదినేపల్లి శివారు అన్నవరం గ్రామానికి చెందిన బొర్రా బాలసాయి(22) శుక్రవారం సాయంత్రం రొయ్యల చెరువుపై పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ముదినేపల్లిలోని అంబేద్కర్ నగర్ సమీపంలో రొయ్యల చెరువుపై కోల్‌కతాకు చెందిన పైపుల్లా, అన్నవరం గ్రామానికి చెందిన బొర్రా బాలసాయి పని చేస్తున్నారు. ఈ క్రమంలో స్విచ్ వేస్తుండగా పైపులా విద్యుదాఘానికి గురయ్యాడు. అతడిని కాపాడే క్రమంలో అక్కడే ఉన్న బాల సాయి దగ్గరకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించగా, పైపులాకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు. బాలసాయి అంత్యక్రియలు శనివారం నిర్వహించారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు

ప్రజాశక్తి - కామవరపుకోట

రూ.2,47,000 నగదును దొంగతనం చేసిన కేసులో వీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన భారతాల రత్నరాజు(23)కు చింతలపూడి మేజిస్ట్రేట్ సిహెచ్.మధుబాబు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. పోలీసులు, ప్రాసిక్యూషన్ తరపున గవర్నమెంట్ ప్లీడర్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... 2021 డిసెంబర్ 25వ తేదీన క్రిస్మస్ పండుగరోజు కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడేనికి చెందిన మద్ద రాజారావు ఇంట్లో చోరీ జరిగింది. ఈ చోరీలో బీరువాలో ఉన్న రూ..2,47,000 నగదు అపహరణకు గురైంది. దీంతో రాజారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ కె.వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీ కేసులో అదే గ్రామానికి చెందిన భారతల రత్నరాజును అరెస్టు చేశారు. వాదోపవాదల అనంతరం నేరం రుజువు కావడంతో నిందతులు రత్నరాజుకు చింతలపూడి మేజిస్ట్రేట్ ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

'చింతల'పూడి

పేరుకే నగర పంచాయతీ..అభివృద్ధిలో వెనక్కి

ప్రజల ఇబ్బందులు.. పట్టించుకోని అధికారులు, పాలకులు

సెంట్రల్ లైటింగ్ లేని చింతలపూడి సెంటర్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మండలం అభివృద్ధిలో వెనక్కి పోతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదు. సమస్యలపై స్పందించడంలేదు. సెంట్రల్ లైటింగ్, డ్రెయినేజీ గురించి పలుమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధిలకు చెప్పినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా చింతలపూడి నగర పంచాయతీ అభివృద్ధి చెండంలేదని వాపోతున్నారు. సమస్యలపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

చింతలపూడి నగర పంచాయతీలో రోడ్లు, డ్రెయినేజీలు, వీధి లైట్లు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. చింతలపూడి నగర పంచాయతీలో ప్రధాన సమస్య అయిన సెంట్రల్ లైటింగ్ గురించి ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఎవరూ పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది నగర పంచాయతీనా లేక గ్రామాలకు వెళ్లే దారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక రోడ్లు అయితే అధ్వానంగా ఉన్నాయి. ప్రధాన సెంటర్‌లో రోడ్లు గుంతలతో దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులుకు గురవుతున్నారు. అధికారులు కనీసం రోడ్ల గురించి పట్టించుకోవడంలేదు. దీంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో పోలీసులు రోడ్లపై గుంతలను పూడ్చి వేసేందుకు చర్యలు తీసుకున్నారు.

ఇక డ్రెయినేజీ విషయానికొస్తే చిన్నపాటి వర్షం వచ్చిందంటే రోడ్డుపైకి వరద నీరు పారుతుంది. రోడ్డుపై గుంతల్లో వర్షపు నీరు, మురుగు నీరు చేరి ఆ గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. నగర పంచాయతీ అధికారులు సమస్యలపై దృష్టి పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా అధికారులు అయినా స్పందించి చింతలపూడి నగర పంచాయతీలో సెంట్రల్ లైటింగ్, డ్రెయినేజీలు, రోడ్లు అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పాలకులు, అధికారుల నిర్లక్ష్యం

ఆర్‌విఎస్.సత్యనారాయణ, చింతలపూడి

చింతలపూడి పట్టణంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల అభివృద్ధి వెనుకబడింది. సెంట్రల్ లైటింగ్, డ్రెయినేజీలు, రోడ్ల సమస్యలను ఉన్నతాధికారులు దృష్టిలో పెట్టుకొని వెంటనే వేయించాలి. ప్రజల ఇబ్బందులను గుర్తించి సమస్యలను త్వరగా పరిష్కరించాలి.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

చిదరాల మధుబాబు, జనసేన మండలాధ్యక్షులు

చింతలపూడి నగర పంచాయతీలో సెంట్రల్ లైటింగ్, డ్రెయినేజీ, రోడ్ల సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి. ప్రధాన సమస్య సెంట్రల్ లైటింగ్‌ను వెంటనే ఏర్పాటు చేయించాలి. రోడ్లపై గుంతలను వెంటనే పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలి. డ్రెయినేజీకి కూడా మరమ్మతులు చేయాలి.

వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలను వినియోగించుకోండి



ముదినేపల్లిలో...

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారిణి ఎం.శ్రీదేవి కోరారు. శనివారం ఆమె మాట్లాడుతూ గ్రంథాలయంలో గత నాలుగు రోజులుగా సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెల ఏడో తేదీ వరకు సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో జరిగే సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు కథలు చెప్పడం, డ్రాయింగ్ వేయించడం, పుస్తకాలు చదివించడం, ఆటలు ఆడించడం, పాటలు పాడించటం మొదలగు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లితండ్రులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపాలని ఆమె కోరారు.

భీమడోలు :విద్యార్థులు తాము విన్న, చదివిన నీతి కథల సారాంశాన్ని జీవితంలో అన్వయించుకుంటే ఉత్తమ భవిష్యత్తు నిర్మాణం సాధ్యమవుతుందని మానవత స్వచ్ఛంద సంస్థ జిల్లా విభాగం కెరియర్ గైడెన్స్ డైరెక్టర్, విశ్రాంత ఉపాధ్యాయులు తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన విద్యార్థులకు నీతి కథల గురించి వివరించారు. గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు సామూహిక పుస్తక పఠనం, బృంద చర్చలు, వాటి విశ్లేషణ, సమీక్ష నిర్వహించడం వంటి కార్యక్రమాలను చేపట్టారు. విద్యార్థులకు ఇతర అంశాలపై తగు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

భీమడోలులో...

స్ట్రాంగ్‌రూముల వద్ద పటిష్ట భద్రత

దెందులూరు ఆర్ఒ, జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు

ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూముల వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామని దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. వట్లూరులోని సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇవిఎంల స్ట్రాంగ్‌రూమ్‌ను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా లావణ్యవేణి మాట్లాడుతూ అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. దెందులూరు నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్‌రూమ్‌లను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ భద్రతా పరిస్థితులను గమనించారు. తలుపులకు వేసిన తాళాలను, తాళాలకున్న సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్నిచోట్లా సీసీ కెమెరాలు తనిఖీ చేశారు. అనంతరం సందర్శకుల రిజిస్టర్‌లో ఆమె సంతకం చేశారు. ఆమె వెంట దెందులూరు తహశీల్దార్ వరహాలయ్య, అధికారులు ఉన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న జెసి లావణ్యవేణి

హామీల అమలులో మోడీ విఫలం

సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు టివిఎస్.రాజు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఎన్నికల హామీలు అమలు చేయడంలో నరేంద్ర మోడీ ఘోరంగా విఫలమయ్యారని సిపిఐ ఏలూరు జిల్లా కౌన్సిల్ సభ్యులు టివిఎస్.రాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అన్నివిధాలా అన్యాయం చేసిందన్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్లపాటు ప్రత్యేక హోదా, కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు, ఉత్తరాంధ్ర రాయలసీమ వెనుక బడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ అందిస్తామని, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా మళ్లీ ఇప్పుడు రాబోయే రెండు సంవత్సరాల్లో పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని నరేంద్ర మోడీ ప్రజలను మాటల గారడీలతో మోసం చేస్తున్నారని విమర్శించారు. విదేశాల్లో దాచుకున్న నల్ల ధనాన్ని బయటకు తీసి ప్రతి పేదవానికి రూ.15 లక్షలు ఖాతాలో వేస్తానన్న హామీని గాలికొదిలేశారన్నారు. దేశంలో గల ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి నరేంద్ర మోడీ దేశంలో మతోన్మాదం రెచ్చగొట్టి ప్రజల్లో వర్గ విభేదాలు సృష్టిస్తారన్నారు. మూడోసారి 400 స్థానాలను కైవసం చేసుకుని భారత రాజ్యాంగాన్ని పక్కనపెట్టి ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని అమలు చేయటానికి ఆరాట పడుతున్న నరేంద్ర మోడీ నాయకత్వంలో గల ఎన్‌డిఎ కూటమి చిత్తుగా ఓడిపోతుందన్నారు. జూన్ నాలుగో తేదీన వెలువడే ఎన్నికల ఫలితాల్లో ప్రజలు ఇండియా వేదికను స్వాగతిస్తారని కేంద్రంలో ఇండియా వేదిక నాయకత్వన నూతన ప్రభుత్వం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

డ్రెయినేజీపై రక్షణమూత ఏర్పాటు చేయరూ..!

ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు

పట్టించుకోని అధికారులు

రక్షణ కవచం లేకపోవడంతో రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో నిత్యం రద్దీగా ఉండే చిన్న కొఠాయి వద్ద డ్రెయినేజీ నీరు పోవడానికి ఏర్పాటు చేసిన గొయ్యి(సంప్)పై ఎటువంటి రక్షణమూత లేకపోవడంతో పెద్ద గొయ్యిగా మారి పెను ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. నిత్యం విజయవాడ-నూజివీడు వెళ్లే బస్సులు, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, చిన్న పిల్లలు తిరగుతుండే ఆ ప్రదేశంలో సదరు గొయ్యిపై ఎటువంటి మూత ఏర్పాటు చేయకపోవడంతో ఆ గొయ్యి ఆర్అండ్‌బి రోడ్డుకు సమాంతరంగా ఉండటంతో కార్లు, ద్విచక్రవాహనదారులు, పాదచారులు గమనించే పరిస్థితి లేక గోతిలో పడి పలువురు గాయాలపాలు కావడంతో పాటు ప్రాణాపాయ పరిస్థితులు సైతం నెలకొంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సదరు గొయ్యిపై మూతలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను రక్షించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పట్టిసీమ ఫెర్రీరేవు బహిరంగ వేలం పాట

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ ఫెర్రీ రేవు బహిరంగ వేలం పాట పట్టిసీమ గ్రామ పంచాయతీ వద్ద శనివారం నిర్వహించారు. పోలవరం మండలం పట్టిసీమ గ్రామానికి సంబంధించి 2024-25 సంవత్సరానికి వాహన స్టాండ్, ఫెర్రీ పాటలను పంచాయతీ సర్పంచి సబ్బారపు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సదరుపాటకు ముగ్గురు పోటీ పడ్డారు. కాకి వీరాజు రూ.1.90 లక్షలకు వాహన స్టాండు పాటను పాడారు. ఫెర్రీ పాటకు సంబంధించి ధరావత్తు ఎవరూ కూడా చెల్లించకపోవడంతో సదరు పాటను ఈ నెల 22వ తేదీ బుధవారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు పంచాయతీ సెక్రటరీ తాతి విజయకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, పాటదారులు పాల్గొన్నారు.

యధేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

కొంగవారిగూడెం కరాటం కృష్ణమూర్తి జలాశయంలో భారీ గుంతలు ఏర్పడుతున్న వైనం

నిరుపయోగంగా రిసార్ట్స్

అపారిశుధ్యంగా జలాశయం ప్రాంతం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం మండలం కొంగవారిగూడెం కరాటం కృష్ణమూర్తి జలాశయంలో ఇరుపక్కల ఎక్కడపడితే అక్కడ మట్టి తవ్వకాలు జరిగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇరిగేషన్ అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మట్టి అక్రమ తవ్వకాల వల్ల జలాశయానికి ముప్పు వాటిల్లే ప్రమాదం చాలా ఉంది. ఈ మట్టి తవ్వకాల వల్ల లోతుగా గుంతలు ఏర్పడి అనేక ప్రమాదాలకు కారణమవుతున్నాయి. జలాశయంలోకి దిగినవారు ఆ గుంతల్లో పడి ప్రాణాలు కోల్పోతున్నారు. నెలరోజుల క్రితం ఒక విద్యార్థి ఈ అక్రమ మట్టి తవ్వకాల గుంతలో పడి మృతి చెందాడు. 20 రోజుల క్రితం స్నానం చేసేందుకు దిగి ముగ్గురు ప్రాణాలు విడిచారు. అయినా ఇరిగేషన్ అధికారులు మాత్రం వారికే పట్టనట్లు చోద్యం చూస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ మట్టి తవ్వకాలు అధికారులు, రాజకీయ నాయకుల కనుసన్నలో పర్సంటేజీల కోసం జరుగుతున్నట్లు సమాచారం. ఎవరి స్వార్థాల కోసం వారు జలాశయం మొత్తాన్ని గుంతలు గుంతలుగా తవ్వుతున్నారని స్థానికులు వాపోతున్నారు.

నిరుపయోగంగా బోటింగ్ పాయింట్, ఫలహార శాల

పైగా జలాశయం గట్టుపై బోటింగ్ పాయింట్, ఫలహారశాల ప్రభుత్వ ఖజానాతో ఒక భవన నిర్మాణం చేపట్టారు. ఆ భవనం ఎటువంటి ప్రభుత్వ కార్యకలాపాలకు ఉపయోగం లేకుండా నిరుపయోగంగా ఉంది. ఆ భవనం చెత్తాచెదారాలతో నిండి ఉంది. ప్రభుత్వ ఖజానాను ఎటువంటి ఉపయోగం లేని పనులకు ఖర్చు పెడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జలాశయం గట్టుపై పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. ఈ గట్టుపై నడవాలంటే విషసర్పాల భయం ఎక్కువగా ఉంటుందని చేపల జాలరులు చెబుతున్నారు. అధికారులు జలాశయం మెయింటెనెన్స్ కూడా గాలికొదిశారని విమర్శిస్తున్నారు. జలాశయం అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి వస్తున్న ఖజానా ఏమౌంతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జలాశయం అభివృద్ధి కుంటుపడిందని వాపోతున్నారు. ఎక్కడ చూసినా శుభ్రత లోపించిందని చెబుతున్నారు. కొన్ని కోట్ల వ్యయంతో నిర్మించిన జలాశయం పక్కన ఉన్న రిసార్ట్స్ నిరుపయోగంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జలాశయంలో యధేచ్ఛగా సాగుతున్న మట్టి మాఫియాపై కొరడా ఝుళిపించాలని, ప్రభుత్వ భవనాలను ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణకు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని, జలాశయ సక్రమ నిర్వహణ చేపట్టి పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న రిసార్ట్స్